# కథ అడ్డం తిరిగింది

జయాపజయాలు మన చేతుల్లో లేవు. ఉంటే నేను ఫోర్తుఫారంలో మూడుమాట్లు ఫైల్ కాకనే వుందును. పరీక్షను తప్పినందుకు నేను అణుమాత్రమైనా చింతించలేదు. ఎంత పట్టుదల వున్నప్పటికి విధి అనుకూలించనిదే మానవ ప్రయత్నం ఫలించదని నాకు తెలుసు. తెలిసీ తెలిసీ విచారించడానికి మూర్ఖుణ్ణిగాను.

లోకంలో అందరూ చేసుకుంటున్నట్లుగా పెండ్లి చేసుకోడంగూడా నా కిష్టం లేదు. వివాహాన్నిగూడా దైవాయత్తం చేసిన దైవాధీనుణ్ణి నేను! నవలల్ని చదివి, సినిమాల్ని చూచి నేను పిచ్చివాడినై పోయానని కొందరి ఉద్దేశం. పిచ్చివాళ్లకు లోకమంతా పిచ్చిగానే తెలుస్తుందట!

చాలా మంది యువకులకు వున్నట్టుగానే నాకు ఒక ప్రియురాలు వున్నది. అజంతా నాగకన్యలు కూడా సౌందర్యంలో ఆమె ముందు తీసికట్టే! ప్రబంధనాయికల్లో ఒక వరూధిని మాత్రం ఆమెకు కుడి ఎడమగా సరిపోవచ్చు. ఆమెపేరు గానీ నివాసంగానీ, కులగోత్రాలు గానీ నాకు తెలియవు. ప్రస్తుతం ఆమె నా మనఃఫలకం మీద చిత్రింపబడి వున్నది. కానీ ఏ క్షణంలోనైనా ఆమె నాకు మానవరూపం దాల్చి ప్రత్యక్షమయ్యేటట్లు చెయ్యమని నేను భారమంతా భగవంతుని పైన వేసి వూరుకోలేదు సుమండీ! అయిదేండ్ల నుంచీ రైలు ప్లాటుఫారాల్లో బస్సుస్టాండ్లలో గాలించుతూనే వున్నాను. ఆ ఎదురుచూస్తున్న ముహూర్తం కోసం ఎంతో ఆతురతతో నిరీక్షిస్తూనే వున్నాను.

ఎందరో అందగత్తెలు నాకు కనపడ్డారు. ఏదో వేరేపనిగా వెళ్తుంటే ఈ కాలం రకరకాల సౌందర్యవతులు కంటపడతారు. ఇక అదే పనిగా దేశసంచారం చేస్తున్న నాకు నేత్రానందకరంగా, అసంఖ్యాకులైన నవయౌవనవిలాసినులు ప్రత్యక్షంగావడం అబ్బురమా మరి? ఇంతో, అంతో భావకవిత్వపు పిచ్చిగూడా నాలో వుండడంచేత

కనుపించిన కాంతలందరిమీదా ఆశువుగా ఎన్నో గేయాలు వ్రాశాను. వాటిని చదివిన నా మిత్రుడొక్కడు "శ్రీనాథుని నీలాటిరేవువర్ణన లెందుకురా నీ గేయాల ముందు? పోషించి, ప్రోత్సహించే ప్రభువుల్లేరుగానీ, నువ్వు కావాలంటే కనీసం ఒక యిరవై కంచు ఢక్కలైనా పగులగొట్టగల ధీమంతుడవురా." అన్నాడు.

ఇంతకూ నాకు కనపడ్డ యువతులందరూ నా "స్వప్న సుందరి" లాంటి అందగత్తెలు కారు. (నేను మనస్సులో చిత్రించుకొన్న సుందరి అప్పుడప్పుడు నా కలల్లోకి గూడా వస్తుంటుంది కాబట్టి ఆమెను 'స్వప్న సుందరి' అని ఉదహరిస్తున్నానని పాఠకులు గమనించాలి) కానీ అందమనే దాన్ని గురించి ఎన్నో కోట్లకొలది అభిప్రాయ భేదాలున్నాయి. నాకు అందంగా వున్న 'ఆమె' ఇంకొకరి కలా కనుపించకపోవచ్చు. అసలు నాకు నీల మేఘచ్ఛాయవంటి నిగనిగలాడే శరీరం గల అమ్మాయిలంటే చాలా యిష్టం! ఎర్రటి ఆడవాళ్లంటే అదేమో నాకు పరమసహ్యం! 'లోకో భిన్నరుచి' అన్న సామెత వుండనే వున్న దాయే. నిరాడంబరంగా తోట్లో చెట్లకు నీళ్ళు పోస్తున్నప్పుడు భార్యను ముద్దెట్టుకొని, సర్వాభరణభూషితురాలై పడకటింట్లోకి వచ్చినప్పుడు, పెడముఖంతో అటు వైపు తిరిగి పడుకొనేవాడట ఎవడో కళాపూర్ణుడు!

విసిగి వేసారిపోయానుగానీ, నేను కోరిన కొంద్రలో వాన కురవనేలేదు. ఎంతో విశ్వాసంతో దైవాన్ని నమ్మిన నాకు ఇంతటి ఆశాభంగం కల్గటం సహించరాని విషయం! ఎల్లకాలమూ నే నిలాగే ప్రణయాన్వేషిగానే వుండిపోతానేమోనని గూడా నాకు భయం కల్గింది. ఈ భయం కల్గినప్పుడంతా నేను విశేషమైన పట్టుదలతో సాహ కార్యాలు చేశాను. నేనయితే నేను చేసిన పనుల్ని సాహస కార్యాలంటున్నానుగానీ, కొందరు వాటిని తెలివి తక్కువ పనులు అని, ఆ పనుల వల్ల నాకు తీరని అవమానం జరిగిందని అంటారు. ధూషణ, భూషణలుగానీ, అవమాన సన్మానాలుగానీ శరీరానికికేగానీ, ఆత్మకు గాదన్నారు మన పెద్దలు! ఎవరో మూర్ఖులు "నీకు పరాభవం జరిగి"ందన్న మాత్రాన నేను బెంబేలుపడిపోయే రకమా, పవిత్రమైన ఈ కర్మభూమిలో జన్మించినవాణ్ణి!

ఒకనాటి తెల్లవారి కాఫీ త్రాగుతుండగా నా బుర్రలో ఒక అద్భుతమైన ఆలోచన తట్టింది. ఎన్నో ప్రేమఘట్టాలకు బిక్ష పెట్టిన మద్రాసుబీచ్‌లో నా అదృష్టరేఖను పరీక్షించుకుంటే? ప్రేమకు సంబంధించిన నవలలు, కథానికలు, నాటకాలు అన్ని క్షుణ్ణంగా చదివిన వాణ్ణని ముందే చూచాయిగా మనవి చేసుకున్నాను. బహుశా అందువల్లనే నాకీ ఆలోచన తోచి వుంటుంది అనుకుంటాను. ఈలాంటి జీవిత సమస్యల్లో ఒక్క సెకండు

ఆలస్యమైనా అమృతం విషమైపోతుందని నా విశ్వాసం! అందుకనే ఆ సాయంత్రమే బయల్దేరాను మద్రాసుకు.

సంధ్యా సమయానికి బీచ్ కలకంఠుల కలకలంతో నిండిపోయింది. ఎందరో వస్తున్నారు? మందగమనంతో ఎందరో యువతులు సముద్రతీరంలో పచారుచేస్తున్నారు? వీళ్లల్లో ఏ ఒక్కరైనా నా కోసం కాచుకొని వున్న మోహినిగా వుండరాదా అని నాకు చిరాకు వేసింది. ఈ కఠినహృదయులకు నా హృదయ తాపం ఏం తెలుసు? ఆలోచించగా, ఆలోచించగా ఈ విశాల ప్రపంచంలో చూచిందే తడవుగా నన్ను ప్రేమించగల యువతి లేనేలేదేమొ ననిపించింది. ఉంటే కేవలం ఒకే క్రీగంటి వీక్షణమైనా లభించివుండదా?

నిరాశా నిస్పృహలతో తపించిపోతున్న నాకు ఎలా వచ్చిందో నిద్ర వళ్లు తెలియకుండా వచ్చేసింది. అపరసాయం కాలంలో నిద్ర ఏమిటని, ప్రశ్నరావచ్చు. ఉదయం నుంచీ మద్రాసులో నేను తిరగని వీధి లేదు. బాగా అలసిపోయాను. నిద్రలేచి చూచే సరికి ఆకాశంలో చంద్రుడు వెల్గుతున్నాడు. దాదాపు పదిగంటలై వుండవచ్చు. బీచ్ నిర్జనంగా వుంది.

సముద్రం ఉవ్వెత్తుగా లేస్తున్న తరంగాలతో మహా సంక్షోభంగా కనుపించింది. చెప్పవద్దూ! నాకు కొంచెం భయం వేసింది. నే నెప్పుడూ సముద్రానికి అంత దగ్గరగా పండుకొని నిద్రించినవాణ్ణిగాను, భూగోళంలో ముప్పాతిక భాగం ఆక్రమించిన ఈ సముద్రం తలచుకుంటే ఈ యిరవై గజాలు పొంగివచ్చి వుండగూడదా? అప్పుడు నా గతి ఏవయ్యుండేది?

లేచి మెల్లగా నడవడం ప్రారంభించాను. నేను మౌంటురోడ్డులోవున్న ఒక హోటలుకు వెళ్లాలి. ఒక ఫర్లాంగు దూరం వెళ్లివుంటాను. నా కాలికి మృదువుగా ఏదో తగిలింది. అదొక డైరీ. వంగి దాన్ని చేతికెత్తుకొన్నాను. దాన్లోనుంచీ ఒక ఫోటో జారి క్రిందపడింది.

చెప్పితే మీరు నమ్మరు! ఆ ఫోటోలో వున్నది నిజంగా జగదేకసుందరి! చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగిపోతున్నట్లుగా ఆ ఫోటోను చూచి నా హృదయం పొంగిపోయింది.

తొందరగా డైరీ తెరచి మొదటి ఫోటోను చూచాను. వెన్నెల వెలుగులో అక్షరాలు స్పష్టంగా కనుపించడం లేదు. దీపం దగ్గరికి వెళ్లి చదువుగల నిబ్బరమూ లేదు. ఎట్లాగో కష్టపడి చదివాను! "మాణిక్యం, నంబరు27, ఎగ్మూరు" అని.

నాకు చాలా మంది పేర్లు నచ్చవు, కానీ 'మాణిక్యం' అన్న పేరు మాత్రం బాగా నచ్చింది. ఇంత శ్రమపడి నేను మద్రాసుయాత్ర చేసినందుకు ఫలితం చేకూరింది! సిరి తనంతట తానే వలచి వచ్చినట్లయ్యింది.

ఆ రాత్రి ఎంత నిదానంగా గడిచిందనుకున్నారు? కాలచక్రం హఠాత్తుగా నిలిచే పోయిందేమోననుకొన్నాను. వేకువజాముకావడమే తరువాయిగా నేను ఎగ్మూరులో హాజరయ్యాను. ఆ యింటిని కనుక్కోడానికి ఎంతోసేపు పట్టలేదు. కానీ తీరా ఆ యిల్లు కనబడేసరికి తరువాత ఏంచేయాలో తోచకపోయింది నాకు. రెండుమూడు సార్లు ఆ యింటిముందు అటూ యిటూ తిరిగాను. లోపలినుంచీ అలికిడి ఏమీ వినరాలేదు.

తొమ్మిదిగంటలయింది. నాకేమీ దిక్కుతోచలేదు. దిక్కు లేనివాడికి దేవుడే దిక్కన్నట్లుగా ఒక పోష్టుజవాను నాకు ఆపద్బాంధవునివలె తోడ్పడ్డాడు. వాడా యింటి ముందుకు వచ్చి 'మాణిక్యం, మాణిక్యం' అని పిలిచాడు. లోపలినుంచీ ఆ యువతి బయటకు వచ్చింది. నా కండ్లను నేనే నమ్మలేకపోయాను. ఆ యువతి నాకు ఫోటోలోకంటే ఇనుమిక్కిలి అందంగా కనబడింది. ఆమెను నేను ఒకటి ఒకటిన్నర నిమిషం మాత్రమే చూచి వుంటాను. ఆ ఒకటి ఒకటిన్నర నిముషాలు తప్పా మిగతా నా అయుష్కాలము నిరర్థకమని యిప్పటికీ నా అభిప్రాయము.

ఈ విధంగా తారట్లాడుతుండగా మధ్యాహ్నం గూడా గడిచిపోయింది. కడకు ఏలాగో ధైర్యం కలుగజేసుకుని ఒక జాబు వ్రాశాను.

'ప్రియమైన మాణిక్యం'

అదృష్టవశాత్తుగా నిన్న సాయంకాలం నీ ఫోటోను చూడ్డం తటస్థించింది. అప్పటి నుంచీ నా మనసు మనసులోలేదంటే నమ్ము. నేరుగా మీ యింటికే వచ్చి నిన్ను కలుసుకుందా మనుకున్నాను. కానీ అంతటి ధైర్యం నాకు లేకపోయింది. మాణిక్యం! నువ్వు నన్ను అనుగ్రహిస్తావా? దీనికి తక్షణం బదులువ్రాయి. నేను మౌంటురోడ్డులో వున్న నెహ్రూకేఫ్ 12వ నంబరు గదిలో వుంటున్నాను.

ఇట్లు,

నీ నాగభూషణం,

ఈ ప్రేమ లేఖను వ్రాసి నేను పోస్టుచేసింది సోమవారం, బుధవారం మధ్యాహ్నానికి మాణిక్యం దగ్గర నుంచి ప్రత్యుత్తరం వచ్చింది. అంతా నేను ఊహించినట్టే జరిగింది!

"ప్రియమైన నాగభూషణం"

నీ లేఖను ఎన్ని సార్లు చదువుకొన్నానో నాకే తెలియదు. నీ దస్తూరిని చూడగానే నీ అందచందాలు నాకు కళ్లకు కట్టినట్లు తెలిసిపోయింది. కొన్ని కారణాల వల్ల మనం మా యింట్లో కలుసుకోగూడదు. ఈ దినం సాయంత్రం ఏడింటికి నేను హోటలుకే వస్తాను.

ఇట్లు,

నీ మాణిక్యం.

గదిని ఎంతబాగా అలంకరించాను? నాలుగైదు సినిమాతారల ఫోటోలుకొని గోడలకు తగిలించాను. నాలుగైదు రూపాయల పూవులతో గదిని పరిమళభరితంగా చేశాను. ఇక నా విషయమంటారా? ఎంతటి పనికిరాని దుస్తులు వేసుకొన్నా నేను చాలా ఆకర్షణీయంగానే వుంటాను. మరి ఆనాటి నా సిల్కుదుస్తుల్తో నేను నవమన్మధుణ్ణే ఐపోయాను.

ఎందుకో, ఏమో? ఆరున్నరయ్యేప్పటికి నా గుండె దడదడ కొట్టుకోసాగింది. మాణిక్యం తప్పకుండా వస్తుంది. ఆమెతో ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? ఆమె నన్ను పెండ్లిచేసుకోవడానికి ఒప్పుకోకపోతే ఎలా?

తలుపు మెల్లగా తెరుచుకుంది. కానీ....కానీ.....లోపలికి వచ్చింది మాణిక్యం గాదు! ఒక ముప్పై అయిదేండ్ల పురుషుడు!

ఆ ఆగంతకుడు గూడా ఏం సామాన్యంగా లేడు. వేషంలో నన్ను మించిపోయి వున్నాడు. అతడు కొంతసేపు గది నాలుగు మూలలా కలయజూచి 'బహుశా నేను పొరబాటు పడివుంటాను. ఇది 12వ నంబరు గది కాదుగదా' అన్నాడు. పొంగి పొరలివస్తున్న కోపాన్ని అణచుకోలేక నేను 'ఇది 12వ నంబరు గదే' అని అరిచాను.

అతడు కొంచెం ఆలోచనతో 'అయితే మీరు ఈ గదిలో ఈనాడే ప్రవేశించారను కుంటాను' అన్నాడు. అతని అవకతవక ప్రశ్నలకు నాకు వళ్లు ఛరాలుమన్నది. 'ఈ గదిలో నేను నాలుగు రోజులుగా వుంటున్నాను' అన్నాను కఠినంగా. ఇక లాభం లేదనకొన్నట్టు అతడు ద్వారంవైపు తిరిగి కొంచెం దూరంవెళ్ళి, మళ్ళీ నా వైపు తిరిగాడు.

అతడు చేతులు నలుపుకుంటూ 'అయ్యా! మీరేమీ అనుకోకండి! ఈ చుట్టుపక్కల గదుల్లో నాగభూషణం అనే అమ్మాయి వున్నదా? ఆమెతో నాకు కొంచెం పని ఉంది' అన్నాడు.

'ఏమీ! నాగభూషణం ఆడదని ఏ వెధవ చెప్పాడు నీతో? నేనే నాగభూషణం' అన్నాను నేను అతణ్ణి ఉరిమిచూస్తూ.

ఆ పురుషుడు జోబీలో నుంచి ఒక కాగితం తీసి నా ముందరవేసి 'ఐతే యిదేమి?' అన్నాడు. అది నేను మాణిక్యానికి వ్రాసిన ఉత్తరం!

నా శరీరం ఒక్కసారి గడగడ వడకిపోయింది. 'మీ రెవరు?' అన్నాను తడబడుతున్న గొంతుకతో, "నేనా! నేనే మాణిక్యాన్ని!' అన్నాడతడు. మరేమీ మాట్లాడడానికి తోచక నా జోబీలో వున్న ఫోటోను చూపించి 'ఈ ఫోటో ఎవరిది?' అన్నాను. అతడు అమాంతంగా నా ముందుకు దూకి ఆ ఫోటోను పెరుక్కొని 'ఈ ఫోటో నీ చేత కెలా వచ్చిందిరా ఇడియట్?' ఇది నా భార్యఫోటో' అని గర్జించాడు.

నేను శిలావిగ్రహంవలె అలానే కూర్చుండిపోయాను. ఆ పెద్దమనిషి ఒక్క అరగంటసేపు నాపై ధాంధూములు చేసి వెళ్లిపోయాడు.

◆ ◆ ◆

గతిమాలిన నా ఈ ప్రణయగాధను గురించి తలంచుకొన్నప్పుడల్లా నా ప్రవర్తనకు నాకే సిగ్గు కల్గుతూ వుంటుంది.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక. 22-8-1951)

❀ ❀ ❀